
సాక్షి మంచిర్యాల

ఆదివారం । 14 । మే । 2023



వెహి'కిల్' డ్రైవింగ్

రోడ్డు ప్రమాదాలు ఏటేటా పెరుగుతున్నాయి. కొందరు యువత అతివేగంగా, రాంగ్‌రూట్‌లో, సిగ్నల్ జంపింగ్ చేస్తూ వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల బారిన పడుతున్నారు. 10లో▸



చదువుకుందాం రండి

వేసవి సెలవుల్లో విద్యార్థులు ఇంటిపట్టునే ఉంటూ పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి. సమాజాన్ని మేల్కొలిపే, గొప్పవ్యక్తుల జీవిత చరిత్ర పుస్తకాలు చదవాలి. 10లో▸



వాతావరణం

ఉదయం ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. రాత్రివేళ మేఘావృతమై ఉంటుంది. వడగాలులు వీస్తాయి. ఎండల తీవ్రత పెరుగుతుంది.

అమ్మంటే మెరిసే మేఘం.. కురిసే వాన.. అని రాశారు ఓ సినీ కవి. నవ మాసాలు మోసి కనీ పెంచి పెద్ద చేసి తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడి ప్రేమ, మమకారాన్ని కలబోసి ఆప్యాయతను పంచే అమ్మ గురించి చెప్పాలంటే అక్షరాలు సరిపోవు. బిడ్డలు పెరిగి ఎంత ఎత్తుకు ఎదిగినా ఆ తల్లి ప్రేమ తరగదు. అనురాగం తగ్గదు. అలాంటి మాతృమూర్తులు ఎంతోమంది తమ జీవితాలను కన్నబిడ్డల కోసం త్యాగం చేస్తున్నారు. కూలీ పనులు చేసుకునే తల్లి నుంచి ధనవంతురాలైనా తమ బిడ్డల బాగోగుల కోసం అను నిత్యం ఆరాటపడుతూనే ఉటుంది. ప్రతియేటా మే రెండో ఆదివారం మాతృదినోత్సవాన్ని అనేక దేశాలు నిర్వహిస్తున్నాయి. అమ్మ గొప్పతనాన్ని తెలియజేసేలా 'మదర్స్ డే' 20వ శతాబ్దం నుంచే మొదలైంది. ప్రపంచంలో అనేక దేశబూలు ఈ రోజును ఘనంగా నిర్వహిస్తుంటాయి. మదర్స్ డే సందర్భంగా తల్లి గొప్పతనాన్ని ప్రతీ బిడ్డ గుర్తు తెచ్చుకోవాల్సి ఉంది.

– సాక్షి ప్రతినిధి, మంచిర్యాల

అమ్మకు ప్రేమతో..!

• జిల్లాలో ఎంతోమంది మాతృమూర్తులు • నేడు అంతర్జాతీయ మాతృదినోత్సవం

అమ్మను నిత్యం స్మరించేలా...





రవి తల్లి తోట సరోజని, ఆర్కేపీ పట్టణ పరిధి గద్దెరాగెడి అమ్మగార్డెన్


జిల్లా కేంద్రం మంచిర్యాల సమీపంలోనే గద్దె రాగిడిలో అమ్మ గార్డెన్ పేరుతో ఓ ఫంక్షన్ హాల్ ఉంది. ఫంక్షన్ హాల్ అమ్మ పేరుతోనే ఉండాలని తల్లి తోట సరోజని జ్ఞాపకార్థం కొడుకు తోట రవి కట్టించాడు. ఇప్పుడా ప్రాంతమంతా అమ్మ గార్డెన్ ఏరియాగా ల్యాండ్ మార్క్‌గా మారిపోయింది. ఆయన పేరు కూడా 'అమ్మ గార్డెన్' రవిగా పిలుస్తుంటారు. 2005లో తన తల్లి ఓ రోడ్డు ప్రమాదంలో మరణించింది. అమ్మంటే ఎంతో ఇష్టపడే ఆయన 2010లో నిర్మించిన ఫంక్షన్ హాల్‌కు 'అమ్మ' అనే పిలుపు వచ్చేలా తన నుంచి అమ్మ దూరం కావొద్దనే ఆకాంక్షతో ఇలా నామకరణం చేశారు. అంతేకాక 'జీవితంలో ఏ ఒక్కరికి హానీ చేయకుండా బతకాలని' అమ్మ చెప్పిన మాటనే నేటికి ఆచరిస్తున్నట్లు రవి గుర్తుచేసుకుంటున్నారు.

అమ్మంటే ప్రాణం



మదర్స్ డే సందర్భంగా తల్లి కమలతో కేక్ కట్ చేయిస్తున్న కొడుకు విశ్వేశ్వర్‌రెడ్డి

జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో పర్యవేక్షణాధికారిగా పని చేస్తున్న మెతుకు విశ్వేశ్వర్‌రెడ్డికి తన తల్లి కమల అంటే ప్రాణం. అమ్మ లేకుంటే ఈ స్థాయిలో ఉండేవాళ్లం కాదని చెబుతుంటారు. సాధారణ రైతు కుటుంబం నుంచి తమను పెంచి పెద్ద చేసి ప్రయోజకులను చేయడంలో అమ్మ పాత్ర మరువలేదని అంటారు. ఏటా మదర్స్ డే రోజు తల్లితో కేక్ కట్ చేయించి అమ్మపై ఇష్టాన్ని చాటుతుంటారు.



కన్నపేగుకు అలుపెరుగని సేవ

• దివ్యాంగురాలైన కూతురికి సపర్యలు

జన్నారం: మానసికంగా ఎదుగుదల లేని కూతురికి అన్నీ తానై తల్లి సపర్యలు చేస్తోంది. కంటికి రెప్పలా చూసుకుంటోంది. మండలంలోని పొనకల్‌కు చెందిన పోతు విజయ, శంకర్ దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురు స్వాతి మానసిక దివ్యాంగురాలు. 26ఏళ్ల వయస్సు వచ్చినా చిన్నపిల్లలాగే ప్రవర్తన ఉంటుంది. తన పనులు కూడా తాను చేసుకోలేదు. తండ్రి శంకర్ రెండేళ్ల క్రితం కరోనాతో మృతిచెందాడు. దీంతో పిల్లల భారం తల్లి విజయపై పడింది. మేదరి పని, కూలీ పనులు చేసుకుంటూ పిల్లలను పోషిస్తోంది. తండ్రి మరణంతో మరింత కుంగిపోయిన స్వాతికి పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయించింది. కుమారుడు శ్రీరాం పదో తరగతి చదువుతున్నాడు. కూతురు స్వాతికి అన్ని సపర్యలు చేస్తూనే కూలీ పనులు చేస్తోంది. ప్రభుత్వం తన పిల్లల చదువులకు సహరించాలని విజయ కోరుతోంది.



కూతురుకు అన్నం తినిపిస్తున్న విజయ

కంటికి రెప్పలా..



కూతురికి అల్పాహారం తినిపిస్తున్న తల్లి

నెన్నెల: ఈ తల్లి 25ఏళ్లుగా కూతురి ఆలనాపాలనా చూస్తునే ఉంది. పుట్టుకతోనే మతిస్థిమితం లేక.. కాళ్లు చచ్చుబడి.. మాట రాక మంచానికే పరిమితమైన కూతురిని కంటికి రెప్పలా చూసుకుంటోంది. మండల కేంద్రం నెన్నెలలోని నేతకానివాడకు చెందిన దుర్గం రాజక్క, బక్కయ్య నలుగురు కూతుళ్లు, కుమారుడు సంతానం. మానసిక వికలాంగురాలైన చిన్న కూతురు రాజేశ్వరి మినహా మిగతా వారి పెళ్లిళ్లు కావడంతో ఎవరి బతుకు వారు బతుకుతున్నారు. బక్కయ్యకు ఆరోగ్యం సహకరించకపోవడంతో రాజక్క కూలీ పనులకు వెళ్తోంది. ''మంచానికి పరిమితమైన బిడ్డకు 25 ఏళ్లుగా సేవ చేస్తున్న. బతికినంత కాలం ఎంత కష్టం వచ్చిన బిడ్డను కంటికి రెప్పలా కాపాడుకుంటా..'' అని తల్లి రాజక్క చెబుతోంది.

అమ్మను ఆదరిద్దాం!

జిల్లాలో అనేక మంది మహిళా ఉద్యోగులు, వివిధ వృత్తుల్లో స్థిర పడిన వారంతా తమ రోజువారీ విధులతోపాటు ఇంట్లో తల్లి బాధ్యతలు చేపడుతూ సాగిపోతున్నారు. ఇంట్లో తమ పిల్లలకు తల్లిగా ప్రేమ, మమకారాన్ని పంచుతూనే, సమాజంలో ఎంచుకున్న దారిలో నడుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాంటి వారు జిల్లాలో అనేక మంది ఉన్నారు. విద్యా, వైద్యం, టీచర్లు, పోలీసు, రైల్వే, న్యాయవాద, నర్సులు, సింగరేణి కార్మికులు, గృహిణులు, రైతులు తదితర ఎన్నో చోట్ల పని చేస్తున్నారు. అమ్మ పడుతున్న కష్టాలను చూసి కొందరు బిడ్డలు తమ మాతృమూర్తిని చాలా గౌరవిస్తున్నారు. పెరిగి పెద్దాయ్యక కూడా వృద్ధాప్యంలోనూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. ఇంకా చాలా చోట్ల అమ్మకు తగిన గౌరవం దక్కడం లేదు. కన్న బిడ్డలే తల్లిని పట్టించుకోకుండా వీధి పాలు చేస్తున్నారు. భిక్షాటన చేస్తూ దుర్భర జీవితాన్ని గడపాల్సి వస్తోంది. అలాంటి తల్లుల బిడ్డలు ఇకనైనా మారి తల్లిని గౌరవించే దిశగా పయణించాల్సిన అవసరం ఉంది.

కొడుకు కళ్లముందు ఉండాలని..

• విగ్రహం, స్మారక వనం ఏర్పాటు



తల్లి రాజమ్మ



అమరజవాన్ రాజేంద్రప్రసాద్ విగ్రహం

తాండూర్: చేతికంది వచ్చిన కొడుకును ఆ మాతృమూర్తి మాతృభూమి రక్షణకు పంపించింది. దేశ రక్షణలో భాగస్వామి అయిన కొడుకు జవాన్ విధుల్లో ఉండగానే ప్రమాదవశాత్తు మరణించాడు. అమరుడైన తనయుడి స్మారకార్థం విగ్రహం, స్మారకవనం ఏర్పాటు చేసింది. తాండూర్ మండలం మాదారం టౌన్‌షిప్‌కు చెందిన గోనే రాజమ్మ ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు గోనే రాజేంద్రప్రసాద్ 2005లో సీఆర్‌పీఎఫ్‌లో జవాన్‌గా విధుల్లో చేరాడు. 2011లో త్రిపురలో విధులు నిర్వర్తిస్తుండగా ప్రమాదవశాత్తు మృతిచెందాడు. కుమారుడి మరణాన్ని తల్లి రాజమ్మ తట్టుకోలేకపోయింది. కొడుకు భౌతికంగా దూరమైన అతడి జ్ఞాపకాలు చెదిరిపోకుండా తాండూర్ పెట్రోల్ బంక్ సమీపంలోని జాతీయ రహదారిని ఆనుకుని స్మారక వనాన్ని ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.12లక్షలు ఖర్చు చేసింది. వీర జవాన్ స్మారక చిహ్నాన్ని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ప్రముఖులు ప్రారంభించారు. రూ.లక్షల విలువైన భూమిలో తనయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి తల్లి ప్రేమను చాటుకుంది. ఏడు పదుల వయస్సులోనూ రాజమ్మ తన కుమారుడు రాజేంద్రప్రసాద్‌ను మరువకుండా కాలం గడుపుతోంది. తల్లి ప్రేమ అజరామరం అనడానికి నిదర్శనం రాజమ్మ. అమ్మా నీకు వందనం.

అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే..

కంటిరెప్పలా కాపాడి మన ఎదుగుదలకు కారణమైన అమ్మని వృద్ధాప్యంలో కాపాడుకోవడం మన బాధ్యత. మలి వయసులో చిన్ననాడు మనపై చూపిన ప్రేమను కొడుకులు చూపించి ఆసరాగా నిలవాలి. జీవితాన్ని ధారబోసిన అమ్మ కోసం ఏం చేసినా తక్కువే. వాళ్లని వృద్ధాశ్రమంలో ఉంచడం అమానుషం. అమ్మను మించిన దైవం లేదు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే.



– గుండేటి యోగేశ్వర్, మంచిర్యాల, ప్రభుత్వ టీచర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత

కొడుకు ఉన్నతి కోసం..



శంకర్‌కు అన్నం తినిపిస్తున్న తల్లి లచ్చక్క

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి గ్రామానికి చెందిన ఎల్లూరి మొండి–లచ్చక్క దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరిలో చిన్న కుమారుడు శంకర్ ఎనిమిదేళ్ల క్రితం కుశ్నపల్లి ప్రభుత్వ పాఠశాల భవనంపై ఆడుతుండగా హైటెన్షన్ విద్యుత్ వైర్ తగిలి రెండు చేతులు కోల్పోయాడు. ఆ తర్వాత ఏడాదికి మొండి అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి తల్లి లచ్చక్క ఇల్లు గడవడం కోసం కూలీ పనికి వెళ్తూనే శంకర్‌కు అన్నీ తానై సపర్యలు చేస్తూ చదివిస్తోంది. స్నానం చేయించడం, దుస్తువులు వేయడం, అన్నం తినిపించడం వంటివన్నీ దగ్గరుండి చేస్తోంది. శంకర్‌కు రెండు చేతులు లేకున్నా ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తున్నాడు. ప్రస్తుతం శంకర్ ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. చేతులు లేకున్నా కాళ్ల వేలి మధ్య పెన్ను పెట్టుకొని రాస్తుంటాడు. కొడుకు ఉన్నతి కోసం తల్లి లచ్చక్క ఆరాటం పడుతోంది.

'ఆయా'మ్మ...



కొడుకుకు అన్నం తినిపిస్తున్న కమల

వేమనపల్లి: భర్త చనిపోయి పుట్టెడు కష్టాల్లో ఉన్నా ఏనాడు ఆమె అధైర్యపడలేదు. దివ్యాంగుడైన కొడుకుకు అమ్మగా సేవలు అందిస్తూ భవిత వికలాంగుల కేంద్రంలో ఆయమ్మగా పని చేస్తోంది. మండలంలోని కేతన్‌పల్లికి చెందిన డొబ్బల కమల భర్త దేవిదాస్ ఏడేళ్ల క్రితం గుండెపోటుతో చనిపోయాడు. కమల కుటుంబ పోషణ కోసం కూలీ, ఉపాధిహామీ పనులకు వెళ్తోంది. శారీరక, మానసిక దివ్యాంగుడైన కొడుకుకు ప్రతీ రోజు ముఖం కడిగి స్నానం పోసి అన్నం తినిపిస్తుంది. రెండేళ్ల క్రితం కూతురు ప్రవీణ పెళ్లి చేసింది. కమల నీల్వాయిలోని భవిత వికలాంగుల కేంద్రంలో ఐదేళ్ల క్రితం ఆయమ్మగా చేరింది. ప్రతీరోజు కొడుకును తీసుకెళ్లి దివ్యాంగులైన పిల్లలకు సేవ చేస్తోంది. రూ.3000 జీతానికే భవిత కేంద్రంలో సేవా దృక్పథంతో పని చేస్తోంది. ఎండాకాలం సెలవులు కావడంతో కొద్దిపాటి జీతం కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది.

కష్టాలకోర్చి..



పిల్లలతో కొట్టె లచ్చవ్వ

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన కొట్టె లచ్చవ్వ భర్త మల్లేష్ 2004లో మృతిచెందడంతో అన్నీ తానై కుటుంబాన్ని పోషించింది. వ్యవసాయ భూమి సాగు చేస్తూ.. కూలీ పనులకు వెళ్తూ ముగ్గురు పిల్ల లను ప్రయోజకులను చేసింది. కూతురు సునీతకు వివాహం చేయగా.. గ్రామంలోనే అంగన్‌వాడీ కార్యకర్తగా విధులు నిర్వర్తిస్తోంది. పెద్ద కుమారుడు సురేష్ కానిస్టేబుల్‌గా పని చేస్తుండగా, చిన్న కుమారుడు నరేష్ ఇటీవల కానిస్టేబుల్ పరీక్షలు రాసి ఫలితం కోసం ఎదురు చూస్తున్నాడు.

సింగరేణిలో ఉద్యోగం చేసి..



ముగ్గురు కొడుకులతో కౌసల్య(ఫైల్)

పాతమంచిర్యాల: పిల్లలకు భవిష్యత్‌ను కల్పించాలనే లక్ష్యంతో బెల్లంపల్లి హన్మాన్‌బస్తీకి చెందిన సల్ల కౌసల్య తన ముగ్గురు కుమారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్ది జీవితంలో స్థిరపడేలా చేసింది. కౌసల్య భర్త చంటిరెడ్డి సింగరేణిలో 1980లో జరిగిన గని ప్రమాదంలో చనిపోయాడు. దీంతో 1982లో సింగరేణి ఏరియా ఆస్పత్రిలో కౌసల్యకు ఉద్యోగం ఇచ్చారు. అప్పుడు ఆమె రూ.300 జీతంతో పని చేస్తూనే ఓటీలు చేసి ముగ్గురు పిల్లలను చదివించింది. 2015లో ఉద్యోగ విరమణ పొందింది. పెద్ద కుమారుడు రాజేందర్‌రెడ్డి ఎంఎస్సీ కెమిస్ట్రీ, పీహెచ్‌డీ చేసి పూనేలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో పని చేస్తున్నాడు. రెండో కుమారుడు రవీందర్‌రెడ్డి ఎంఎస్సీ కెమిస్ట్రీ చేసి కెమిస్ట్రీ లెక్చరర్‌గా హైదరాబాద్‌లో పని చేస్తున్నాడు. మూడో కుమారుడు రాఘవేందర్‌రెడ్డి కెనరాబ్యాంక్‌లో మేనేజర్‌గా బెంగళూర్‌లో పని చేస్తున్నాడు.

న్యూస్‌రీల్

మోడల్ స్కూళ్లలో మెరిట్ జాబితా

పాతమంచిర్యాల: తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6వ, 7నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాల కోసం గత నెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహించగా, మెరిట్ జాబితాను ఆయా మోడల్ స్కూళ్లలో అందుబాటులో ఉంచినట్లు జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతికి, 7 నుంచి 10వ తరగతి సీట్లకు పరీక్ష రాసిన విద్యార్థులు ఆయా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని తెలిపారు.

టెక్నాలజీని వినియోగించుకోవాలి

పాతమంచిర్యాల: విద్యార్థులు, ఉపాధ్యాయులు వి షయ పరిజ్ఞానాన్ని మెరుగు పర్చుకునేందుకు టెక్నాలజీని వినియోగించుకోవాలని, కృత్రిమ మేధస్సు సాధనాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.యాదయ్య, ఐసీటీ అవార్డు గ్రహీత వి.గోపాల్ అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా విద్యాశాఖ, సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్ సమ్మర్ క్యాంపులో 11వ రోజు విద్యార్థులకు ప్రత్యేక వెబినార్ శనివారం నిర్వహించారు. సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులతోపాటు జిల్లాలోని ఇతర విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు భాగస్వాములయ్యారు. మేడ్చల్ జిల్లా గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, జాతీయ ఐసీటీ అవార్డు గ్రహీత వీరనాల గోపాల్ కృత్రిమ మేధస్సు, చాట్ జీపీటీ, ఐసీటీ టూల్స్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు జూమ్ వెబినార్ ద్వారా అవగాహన కల్పించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాల విద్యాశాఖ ద్వారా పాఠ్యపుస్తకాలు, ఇతర మాధ్యమాల ద్వారా విషయ పరిజ్ఞానాన్ని అందజేస్తున్నాయని అన్నారు. వీటికి అనుబంధంగా టెక్నాలజీ మిళితం చేస్తూ బోధనా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుబాబు, ఉపాధ్యాయుడు తిరుపతి పాల్గొన్నారు.

విధుల్లో 19మంది చేరిక

• 15 మంది జేపీఎస్.. నలుగురు ఓపీఎస్‌లు
• 243 మంది కొత్తవారికి సిద్ధమవుతున్న పోస్టింగులు
• కలెక్టర్‌కు తుది జాబితా అందజేత

పాతమంచిర్యాల: నిరవధిక సమ్మె చేస్తున్న జేపీఎస్, ఓపీస్‌లు శనివారం మధ్యాహ్నం 12 గంటల్లోపు విధుల్లో చేరాలని ప్రభుత్వం మరోమారు ఆదేశాలు జారీ చేసింది. గత మంగళవారం మొదటిసారి ఆదేశాలు జారీ చేయగా ఆ రోజు ఏడుగురు జేపీఎస్‌లు విధుల్లో చేరారు. రెండోసారి ఇచ్చిన అవకాశం మేరకు శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఎనిమిది మంది జేపీఎస్‌లు, నలుగురు ఓపీఎస్‌లు విధుల్లో చేరారు. మొత్తం 19 మంది ఇప్పటివరకు డీపీఓ వెంకటేశ్వర్‌రావు సమక్షంలో విధుల్లో చేరుతున్న లేఖలు అందజేశారు.

కొత్త ఓపీఎస్ పోస్టింగులకు సిద్ధం

కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశాల మేరకు డీపీఓ వెంకటేశ్వర్‌రావు కొత్తవారికి పోస్టింగులు సిద్ధం చేస్తున్నారు. 310 గ్రామ పంచాయతీలకు గాను ప్రస్తుతం చేరిన 19 మందితో కలిపి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు 51 మంది ఉన్నారు. జేపీఎస్, ఓపీఎస్‌ల స్థానంలో 243 మందికి కొత్తగా పోస్టింగులు ఇచ్చేలా డీపీఓ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో జేపీఎస్ పోస్టింగుల కోసం నిర్వహించిన పరీక్షల మేరకు అందులో నుంచి మెరిట్ ప్రకారం 243 మందిని ఓపీఎస్‌లుగా ఎంపిక చేయనున్నారు. శనివారం అర్ధరాత్రి వరకు ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని డీపీఓ తెలిపారు. కొత్తగా ఎంపిక చేసిన కొత్త ఓపీఎస్‌ల సర్టిఫికెట్ల పర్యవేక్షణ త్వరితగతిన పూర్తి చేసి సోమవారం నుంచి గ్రామాల్లో బాధ్యతలు స్వీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

విధుల్లో చేరిన వారు వీరే..

విధుల్లో చేరాలని లేనిపక్షంలో తొలగిస్తామనే ప్రభుత్వ హెచ్చరిక మేరకు జిల్లాలో 19 మంది జేపీఎస్, ఓపీఎస్‌లు విధుల్లో చేరారు. వీరిలో సస్పెండైన గుడిపేట, మద్రిగూడకు చెందిన జేపీఎస్‌లు కూడా ఉన్నారు.

జేపీఎస్‌లు..

మండలం	గ్రామం	పేరు
హాజీపూర్	గుడిపేట–నంనూర్	మల్లేశ్
లక్సెట్టిపేట	బలరావుపేట	పి.శృతి
భీమిని	అక్కలపల్లి	ఏ.జగదీశ్
లక్సెట్టిపేట	మిట్టపల్లి	ఎస్.మాధవి,
జైపూర్	వేలాల	గోపిచంద్‌నాయక్
జన్నారం	మొద్రిగూడ	చంద్రమౌళి
కోటపల్లి	పంగిడిసోమారం	బి.సత్యనారాయణ,
కోటపల్లి	రాపనపల్లి	డి.కమలాకర్
కోటపల్లి	సుపాక	ఈ.తిరుపతి
కోటపల్లి	ఆలగాం	తాళ్ల రాజన్న
కోటపల్లి	కనుకుల	సాగర్
కోటపల్లి	వెంచపల్లి	పి.స్వర్ణ
ఓపీఎస్‌లు		
భీమిని	వీగాం	బాలమల్లు
లక్సెట్టిపేట	తిమ్మాపూర్	లావణ్య
కోటపల్లి	దేవులవాడ	దామోదర్
కోటపల్లి	జానగాం	పి.శ్రీనివాస్
కోటపల్లి	పార్‌పల్లి	గోదారి తిరుపతి
కోటపల్లి	రొయ్యలపల్లి	బి.సందీప్

మెరుగైన వైద్యసేవలు అందించాలి

• డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు



ఓపీ రికార్డులు పరిశీలిస్తున్న సుబ్బరాయుడు

పాతమంచిర్యాల: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో జీసీ.సుబ్బరాయుడు అన్నారు. జైపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం, కుందారం ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైపూర్ పీహెచ్‌సీలో ఓపీ, రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించారు. గర్భిణులకు అందిస్తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో సుఖప్రసవాలు చేయాలని, గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని, రక్తహీనత రాకుండా ఆహారపు అలవాట్లు తెలియజేయాలని సూచించారు. అనంతరం కుందారం ఆస్పత్రిని తనిఖీ చేసి నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. టేకుమట్ల ఉప కేంద్రంలో జాతీయ టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. ఇందారంలో కొనసాగుతున్న హెల్త్ వెల్‌నెస్ కేంద్రాన్ని సందర్శించి వైద్యాధికారి మౌనికకు సూచనలు చేశారు. జైపూర్ వైద్యాధికారి అనిల్‌రావు, ఫార్మాసిస్టు చంద్రయ్య, ల్యాబ్‌టెక్నీషియన్ శర్మ, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇంచార్జి ఈఈగా పెద్దన్న

పాతమంచిర్యాల: రోడ్లు, భవనాల శాఖలో ఈఈగా పనిచేస్తున్న రామును ఇటీవల సిద్దిపేటకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కొత్తవారిని నియమించకపోవడంతో ఆసిఫాబాద్ ఈఈగా పనిచేస్తున్న పెద్దన్నకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఓపెన్ ఇంటర్‌లో 92 మంది గైర్హాజరు

పాతమంచిర్యాల: ఈ నెల 2న వాయిదా పడిన ఓపెన్ ఇంటర్ ఎకనామిక్స్ పరీక్షను శనివారం జిల్లాలోని ఏడు కేంద్రాల్లో నిర్వహించారు. 557 మందికి గాను 465 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య తెలిపారు. జిల్లాలోని మంచిర్యాలలో 5 కేంద్రాలు, బెల్లంపల్లిలో 2 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 5 పరీక్ష కేంద్రాలను డీఈవో సందర్శించారు.

రైతులకు నష్టం కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు



సూచనలు చేస్తున్న మధుసూదన్‌నాయక్

పాతమంచిర్యాల: రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తెలిపారు. శనివారం జైపూర్ మండలం టేకుమట్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, జైపూర్ డీసీఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆర్డీవో వేణుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ సౌకర్యాలు కల్పించాలని, గన్నీ సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. తేమ శాతం 17కంటే ఎక్కువ లేకుండా ధాన్యం సంచులు ఉండాలని, రైతులకు కొనుగోలు పత్రాలు ఇవ్వాలని తెలిపారు. అనంతరం జయలక్ష్మి రైస్‌మిల్, వరలక్ష్మి రైస్‌మిల్లులను సందర్శించి కేటాయించిన వరిధాన్యం లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. రైస్‌మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని తెలిపారు. స్థానిక తహసీల్దార్ మోహన్ రెడ్డి, ఆయా కేంద్రాల నిర్వాహకులు పాల్గొన్నారు.

16వ రోజుకు జేపీఎస్, ఓపీఎస్‌ల సమ్మె



సోని మృతికి కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న జేపీఎస్, ఓపీఎస్‌లు

పాతమంచిర్యాల: తమను రెగ్యులర్ చేస్తూ జేపీఎస్, ఓపీఎస్ వ్యవస్థను రద్దు చేయాలని మంచిర్యాల ఐబీ చౌరస్తాలో చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె శనివారం 16వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరం వద్ద వరంగల్ జిల్లా ఖానాపూరం మండలం రంగాపూర్ జేపీఎస్ బైరి సోని మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. జీఓ రావాలి.. జీపీకి పోవాలంటూ.. ప్రభుత్వం బెదిరింపులకు గురి చేయకుండా రెగ్యులర్ చేసేలా చూడాలని కోరారు. శాంతియుతంగానే ప్రభుత్వాన్ని తమ డిమాండ్‌ను పరిష్కరించాలని విన్నవిస్తున్నామనే తప్ప ప్రభుత్వానికి వ్యతిరేకంగా వెళ్లడం లేదని అన్నారు. డిమాండ్‌ను సాధించే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. జేపీఎస్ బైరి సోని మృతికి సంతాప సూచకంగా ఐబీ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట జేపీఎస్, ఓపీఎస్‌లు కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు.

క్లుప్తంగా

శాంతిఖని గనిలో కార్మికుడికి గాయాలు

తాండూర్: మందమర్రి ఏరియాలోని శాంతిఖని గనిలో జరిగిన ప్రమాదంలో కార్మికుడికి గాయాలయ్యాయి. శనివారం 10 గంటల షిఫ్టులో గని ఉపరితలంలో కన్వేయర్ బెల్ట్‌ను అండర్ గ్రౌండ్‌లోకి పంపించేందుకు ఎస్కార్ట్‌తో టబ్బులో లోడ్ చేస్తుండగా బెల్ట్ తెగిపోవడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న జనరల్ మజ్దూర్ కార్మికుడు సాంశెట్టి వెంకటేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు వెంటనే స్థానిక సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు రెఫర్ చేశారు. ఇందుకు కారణమైన ఇద్దరిపై గని అధికారులు చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.

బజ్జీలు తిని పలువురికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

తిర్యాణి(ఆసిఫాబాద్): వారసంతలో ఏర్పాటు చేసిన మిర్చిబండి వద్ద బజ్జీలు తిన్న పలువురు అస్వస్థతకు గురయ్యారు. మండల కేంద్రంలోని వారసంతలో మంచిర్యాల జిల్లా తాండూర్ మండలానికి చెందిన వ్యక్తి మిర్చి బండి నడుపుతున్నాడు. శుక్రవారం ఈ బండి వద్ద మిర్చీబజ్జీలు, బోండాలు తిన్నా 50 మందికి వాంతులు, విరోచనాలు కావడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కలుషితమైన ఆహారం తిన్నందువల్లే అస్వస్థతకు గురయ్యారని, పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యుడు హర్షవర్ధన్ తెలిపారు. మిర్చిబండి నిర్వాహకుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆటో, బైక్ ఢీ..

బెజ్జూర్(సిర్పూర్): ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఎనిమిది మందికి గాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన ఆత్రం భుజంగరావ్, పార్తెటి మహేశ్, సాయిలు శనివారం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై సోమిని గ్రామానికి వెళ్లారు. సాయంత్రం ముంజంపల్లికి తిరిగి వస్తుండగా కుకుడా–పోతేపల్లి గ్రామాల మధ్య ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన ఆటో అదుపు తప్పి బైక్‌ను ఢీ కొట్టి బోల్తా పడింది. ఆ సమయంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురితో పాటు బైక్‌పై వస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు.

సీఎంకు పోస్టుకార్డులు పంపిన వీవోఏలు

పాతమంచిర్యాల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం వీవోఏలు శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు పోస్టుకార్డులు రాసి పంపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 27 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం శోచనీయమన్నారు. క్రమబద్ధీకరణ చేసి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు వీవోఏలు పాల్గొన్నారు.

వెహి‘కిల్’ డ్రైవింగ్!

- ప్రమాదమని తెలిసినా యువతలో తగ్గని వేగం
- రాంగ్‌రూట్, సిగ్నల్ జంపింగ్ అధికం
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- వేసవి సెలవుల్లో జాగ్రత్తలు తప్పనిసరి

జిల్లాలో నమోదైన మైనర్ డ్రైవింగ్ కేసులు		
సంవత్సరం	కేసులు	జరిమానా
2022	36	రూ.18 వేలు
2023 (మే 13 వరకు)	13	రూ.5వేలు



వాహనంపై దూసుకెళ్తున్న మైనర్లు

మంచిర్యాలక్రైం: అతివేగం ప్రాణాలను బలి తీసుకుంటోంది. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అధికశాతం లైసెన్స్ లేనివారు, మైనర్లు ఉండడం కలవర పెడుతోంది. యువత బైక్ రేసింగ్‌లు, సినిమాల్లో హీరోలను చూసి వారిలాగే తామూ వాహనం నడపాలనే ఆలోచనతో వేగంగా దూసుకెళ్తున్నారు. విద్యాసంస్థలు, అమ్మాయిలు ఉన్నచోట గొప్పల కోసం విన్యాసాలు చేస్తూ ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. గతేడాది కరీంనగర్‌లో 16 ఏళ్ల బాలుడు నిర్లక్ష్యంగా కారునడిపి నలుగురి ప్రాణాలు బలిగొన్నాడు. ఈ ప్రమాద ఘటన అప్పట్లో చర్చనీయాంశమైంది.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకే...

కేంద్ర ప్రభుత్వం 30 ఏళ్ల క్రితం తీసుకువచ్చిన మోటార్ వాహనాల చట్టానికి స్వల్ప మార్పులు చేసి 2019 సెప్టెంబర్ 1 నుంచి అమలు చేయాలని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడంతో ఆమోదం లభించింది. ఈ చట్టం ద్వారా మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులకు సైతం సెక్షన్ –199 ప్రకారం రూ.25వేలు జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష, వాహన రిజిస్ట్రేషన్ రద్దు, ఉద్యోగులైతే ఉద్యోగం సైతం ఊడిపోతోంది. దీనిపై రాష్ట్రంలో కొంత నిరసనలు వ్యక్తమయ్యాయి.

చట్టం ఏం చెబుతోంది?

- ట్రాఫిక్ పోలీసులు ఉల్లంఘనలను ప్రధానంగా మూడు కేటగిరీలుగా విభజిస్తారు. అవి వాహనం నడిపే వ్యక్తికి ముప్పు కలిగించేవి, ఎదుటి వారికి ముప్పు కలిగించేవి, మైనర్ డ్రైవింగ్.
- ఇండియన్ మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం 16 ఏళ్ల లోపు వయస్సు వారు ఎలాంటి వాహనాలు నడపకూడదు. 16 ఏళ్లు నిండిన వారు కేవలం గేర్లు లేని సాధారణ వాహనాలను మాత్రమే నడిపేందుకు అవకాశం ఉంది.
- 18 ఏళ్లు నిండిన తర్వాతనే గేర్లతో కూడిన వాహనాలు నడపడానికి అర్హులు. చట్ట ప్రకారం మైనర్ లేదా డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి వాహనం ఇచ్చిన యజమాని సైతం శిక్షార్హుడేనని చట్టంలోని 180 సెక్షన్ చెబుతోంది.
- చట్టంలోని 2019 సవరణ ప్రకారం మైనర్ ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడితే రూ.25 వేల జరిమానా, మూడేళ్ల జైలుశిక్ష విధిస్తారు. వాహనం ఇచ్చిన వారిని సైతం బాధ్యులను చేస్తారు.
- దేశ వ్యాప్తంగా ఏటా 11 శాతం రోడ్డు ప్రమాదాలు మైనర్లు వాహనాలు నడపడంతోనే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి.
- మైనర్లు వాహనాలు నడిపే సమయంలో అనుకోకుండా రోడ్డు ప్రమాదం జరిగి కేసు నమోదు చేస్తే చట్టపరంగా బాధితులకు రావాల్సిన ఎలాంటి బెనిఫిట్స్ వర్తించవు. వాహనానికి బీమా ఉన్నప్పటికీ దానిని క్లెయిమ్ చేయలేని పరిస్థితి.
- వాహనాలు నడిపే పిల్లలపై కోర్టుల్లో నేరాభియోగపత్రం దాఖలు చేస్తారు. దీంతో కనీసం రెండు నుంచి ఏడు రోజుల వరకు పరిశీలన గృహానికి (జువైనల్ హోం) తరలిస్తారు. వారికి వాహనం ఇచ్చిన తల్లిదండ్రులపైనా కేసు నమోదు చేస్తారు.

జిల్లాలో జరిగిన సంఘటనలు కొన్ని..

- గతేడాది ఏప్రిల్ 26న మందమర్రి మండలం ఊరు రామకృష్ణాపూర్ సమీపంలో రహదారిపై ఓ బాలుడు ద్విచక్ర వాహనం నడుపుకుంటూ రాంగ్‌రూట్‌లో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో ఓ ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడు బాలు మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన బాలునిపై కేసు నమోదైంది.
- గతేడాది జూన్ 17న హైటెక్ సిటీ వెనుకభాగంలో ఇద్దరు మైనర్ బాలురు ద్విచక్ర వాహనాలపై ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ఘటనలో గౌతమినగర్‌కు చెందిన ప్రణీత్ తలకు తీవ్రగాయాలయ్యాయి. కాగా ఈ ప్రమాదంపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో కేసు నమోదు కాలేదు.
- గత నెల 30న హాజీపూర్ మండలం గుడిపేట వద్ద జాతీయ రహదారిపై 14 ఏళ్ల బాలుడు శ్రీహరి, 20 ఏళ్ల యువకుడు శ్రీధర్ కేటీఎం బైక్‌పై అతివేగంగా వెళ్తూ నిలిపి ఉన్న లారీని ఢీకొట్టారు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

తల్లిదండ్రులూ.. ఇవి గుర్తించండి

- సహజంగా 13 నుంచి 18 ఏళ్లలోపు బాలురకు వాహనాలు నడపాలన్న ఉత్సాహం ఎక్కువగానే ఉంటుంది. వెంటనే నేర్చుకోవాలని, వేగంగా, అందరికంటే డిఫరెంట్‌గా బైక్ నడపాలని ఉత్సాహపడుతారు. ఇదే రోడ్డు ప్రమాదాలకు కారణమవుతోంది. పలు సంఘటనల దృష్ట్యా మైనర్ డ్రైవింగ్‌ను తీవ్ర ఉల్లంఘనగా భావిస్తున్న ఉన్నత న్యాయస్థానాలు తల్లిదండ్రులకు సైతం శిక్షలు అమలు చేస్తున్నాయి.
- వాహనాలపై ఉన్న మోజుతో స్నేహితుల వద్ద గొప్పలు చెప్పుకునేందుకు ఇంట్లో తల్లిదండ్రులు ఏపనిచెప్పినా బైక్ ఇస్తేనే వెళ్తానని పిల్లలు మొండికేస్తుంటారు. తమ అవసరాల కోసం కన్నవాళ్లు కాదనలేక వాహనాలు ఇస్తున్నారు. ఇదే అదనుగా భావించిన మైనర్లు రోడ్లపై వేగంగా దూసుకెళ్తున్నారు. ఇలా వాహనాలు నడుపుతూ ఏదైనా ప్రమాదానికి గురైతే హత్య కేసు నమోదు చేసే వీలుంటుందని చట్టం స్పష్టం చేస్తోంది.

తనిఖీలు నిర్వహిస్తున్నాం



మైనర్లు ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడితే మొదటిసారి కౌన్సిలింగ్ ఇస్తున్నాం. మార్పు రాకుంటే మైనర్‌తో పాటు వాహన యజమానిపై సైతం కేసు నమోదు చేస్తున్నాం. ఇలాంటి వారిని గుర్తించేందుకు నిరంతరం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నాం.

– నరేశ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ, మంచిర్యాల

వృద్ధురాలి హత్య

ఆసిఫాబాద్‌రూరల్: బండరాయితో కొట్టి వృద్ధురాలిని హత్య చేసిన సంఘటన మండలంలోని వాడిగొందిలో చోటు చేసుకుంది. సీఐ రాణాప్రతాప్, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఆత్రం పొత్తుబాయి (60) శుక్రవారం మండలంలోని బనార్‌గొందిలో జరిగిన బంధువుల వివాహ వేడుకలకు వెళ్లింది. సాయంత్రం తిరుగు ప్రయాణంలో కుమారుడి వరుసైన ఆత్రం మారుతి ద్విచక్ర వాహనం ఎక్కింది. మద్యం మత్తులో ఉన్న మారుతి గ్రామ సమీపంలోకి రాగానే వాహనం ఆపి తాగి వృద్ధురాలు ధరించిన చేతి కడియాలు, ఇతర ఆభరణాలు లాక్కునేందుకు యత్నించాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్తానని బెదిరించడంతో అక్కడే ఉన్న బండరాయితో తలపై బాదడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త మహదు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

మందమర్రిలో కలకలం రేపిన యువకుడి హత్య



యువకుడి మృతదేహం

పాతమంచిర్యాల: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం తెల్లవారు జామున జరిగిన యువకుడి హత్య సంఘటన పట్టణంలో కలకలం రేపింది. ఎస్సై చంద్రకుమార్, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. కాసిపేట మండలంలోని మామిడిగూడెంకు చెందిన లౌవుడం సాగర్ (21)మందమర్రికి చెందిన గిరిబాబు లారీపై క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం డ్యూటీ దిగిన సాగర్ సాయంత్రం ఇంటికి వెళ్లాడు. రాత్రి సుమారు 8 గంటల ప్రాంతంలో ఫోన్ రావడంతో ఓనర్ డబ్బులు ఇస్తానన్నాడని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. శనివారం ఉదయం పోలీసులు గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి ద్వారా తమ కుమారుడు మృతి చెందాడని మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లారీ ఓనర్ గిరిబాబు, వాటర్ ప్లాంట్ చిట్టి, బొడ్డు బాలాజీ, నూనె వెంకటేశ్, అల్లంకుంట గణేశ్, సాగర్ తమ కుమారుడిని హత్య చేశారని మృతుని తండ్రి తారాచంద్ ఫిర్యాదు మేరకు సీఐ మహేందర్‌రెడ్డి కేసు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా పట్టణంలోని మొదటి జోన్ సీఎస్‌ఐ చర్చిలైన్‌లో సాగర్ గతంలో వాటర్ ప్లాంటులో పనిచేసినప్పటి నుంచి ఒక యువతితో ప్రేమ వ్యవహారం కొనసాగుతోందని, శుక్రవారం రాత్రికూడా ఆమె కోసమే రావడంతో కుటుంబ సభ్యులు దాడి చేయించి ప్రమాదం జరిగినట్లు ఆస్పత్రిలో చేర్పించారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

శుభకార్యానికి వెళ్లివస్తూ తిరిగిరాని లోకాలకు..

- లారీ ఢీకొని వ్యక్తి మృతి
- జన్నారం మండలం రోటిగూడలో విషాదం



మహేశ్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్సై

లక్సెట్టిపేట/జన్నారం: శుభకార్యానికి వెళ్లివస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. లక్సెట్టిపేట ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం జన్నారం మండలం రోటిగూడ గ్రామానికి చెందిన రాగం శంకరయ్య, లక్ష్మి దంపతులకు కుమారుడు మహేశ్(35), ఇద్దరు కూతుర్లు ఉన్నారు. మంచిర్యాలలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న మహేశ్‌కు భార్య శ్రీలత, ఇద్దరు పిల్లలున్నారు. ఉద్యోగరీత్యా మంచిర్యాలలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం జన్నారం మండలంలో జరిగిన బంధువుల వివాహానికి, దండేపల్లి మండలంలో జరిగిన మరో శుభకార్యానికి హాజరయ్యాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై మంచిర్యాలకు తిరిగి వెళ్తుండగా లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ఆంధ్రాకాలనీ వద్ద ప్రధాన రహదారిపై ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం రోటిగూడలో మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుని తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీసీ గణనకోసం ఐక్యంగా ఉద్యమించాలి



మాట్లాడుతున్న బీసీ సంఘాల నాయకులు

పాతమంచిర్యాల: బీసీ గణనకోసం ఐక్యంగా ఉద్యమించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గాండ్ల తిలకేశ్వర సంఘ కార్యాలయంలో శనివారం బీసీ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో బీసీల లెక్క తేలితేనే రిజర్వేషన్లు, సంక్షేమ ఫలాలు దక్కుతాయన్నారు. బ్రిటీష్‌ల పాలనలో 1931లో చివరిసారిగా బీసీల జనాభా లెక్కలు తీశారని, స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా బీసీల గురించి ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వమే జనగణన చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. సమావేశంలో నాయకులు కనుకుట్ల మల్లయ్య, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, భారత్ బచావో రాష్ట్ర కమిటీ నాయకులు వడ్డేపల్లి మనోహర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంతేశ్వర్, గాండ్ల తిలకేశ్వర సంఘం జిల్లా అధ్యక్షుడు బుద్ధి చంద్రమౌళి, సీనియర్ న్యాయవాది కర్రె లచ్చన్న, తులా మధుసూదన్, సూరినేని కిషన్, పాయిరాల రాములు, సతీష్ యాదవ్, గజెల్లి వెంకటయ్య, సమ్ము రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు అండగా ఉంటాం

పాతమంచిర్యాల: పేద విద్యార్థులకు తెలంగాణ బీసీ జాగృతి ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జన్మభూమి నగర్‌లో ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన శ్రీరాముల హరిక, బోయిన అక్షయ్‌కుమార్‌లను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. బీసీ జాగృతి నాయకులు డాక్టర్ రాజారమేశ్, ఇత్యాల కిషన్, పట్టణ అధ్యక్షుడు వైద్యభాస్కర్, కార్యదర్శి రవి, యువ జాగృతి నాయకులు మంచర్ల సదానందం, తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి



మాట్లాడుతున్న ఏజెంట్ రాముడు

పాతమంచిర్యాల: కార్మికులు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్ మాలోత్ రాముడు అన్నారు. ఏజెంట్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా శనివారం గనిని సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమష్టి కృషితో పనిచేస్తేనే అనుకున్న లక్ష్యాలను సాధిస్తామన్నారు. ఉద్యోగులు తమ విధులతో పాటు ఆరోగ్యంపై కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. నిత్యం యోగా, వ్యాయామం చేయడం వల్ల దీర్ఘకాలిక జబ్బుల నుంచి కాపాడుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ స్వామిరాజు, రక్షణాధికారి కొట్టె రమేశ్, పిట్ కార్యదర్శి జంపయ్య, సంక్షేమాధికారి పాల్‌సృజన్, ఇంజనీర్ కృష్ణ, సర్వే అధికారి పిచ్చేశ్వర్‌రావు, వెంటిలేషన్ అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మప్రేమకు దూరమైన చిన్నారులు

- వడదెబ్బతో మహిళ మృతి
- మదర్స్‌డేకు ముందురోజే ఘటన



అనపర్తి సుమ(ఫైల్)



నిరాశగా చూస్తున్న చిన్నారులు

భీమారం(చెన్నూర్): మదర్స్ డేకు ముందు రోజే ఆ చిన్నారులు అమ్మప్రేమకు దూరమయ్యారు. ఆదివారం అంతా మాతృదినోత్సవం జరుపుకుంటుండగా ఆ ఇంట్లో మాత్రం విషాదఛాయలు అలుముకున్నాయి. వడదెబ్బతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం భీమారం మండలం పోలంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తాళ్లగూడెంకు చెందిన అనపర్తి సుమ (29) శుక్రవారం ఉదయం అదే గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి సాయంత్రం తిరిగివచ్చింది. వాంతులు చేసుకోవడంతో పాటు జ్వరం కూడా రావడంతో అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త ప్రేమ్‌కుమార్, కుమార్తెలు మీనాక్షి, మనశ్రీ, కుమారుడు రిహాన్ ఉన్నారు.

తల్లి మందలించిందని ఆత్మహత్యాయత్నం

తిర్యాణి(ఆసిఫాబాద్): తల్లి మందలించిందని కుమారుడు ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండలంలోని రొంపెల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల గ్రామానికి చెందిన పెందూర్ మహిపతిరావు, విజయ దంపతుల కుమారుడు యోనస్(12)స్థానిక పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నాడు. శనివారం తలకు పెట్టుకునేందుకు షాంపు తీసుకురావాలని విజయ కుమారుడు యోనస్‌ను కోరడంతో అందుకు నిరాకరించాడు. దీంతో అతని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురై ఇంటి పరిసరాల్లో ఇటుకల్లో దాచి ఉంచిన పురుగుల మందు తాగాడు. గమనించిన విజయ స్థానికుల సాయంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం మంచిర్యాల ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు వైద్యుడు హర్షవర్ధన్ తెలిపారు.

చదువుకుందాం రండి..!

పుస్తకం హస్తభూషణం..ఒక పుస్తకం వెయ్యి మంది మిత్రులతో సమానం.. ‘చిరిగిన చొక్కా అయినా తొడుక్కో మంచి పుస్తకం కొనుక్కో’ అన్నారు పెద్దలు. ప్రస్తుతం వేసవి సెలవులు ఓ వైపు.. ముదురుతున్న ఎండలు మరోవైపు.. ఈ నేపథ్యంలో సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఇంట్లో కూర్చుని పుస్తకాలు చదవడం మేలు. సాహిత్యం, విజ్ఞానం, మేధస్సుకు సంబంధించిన వివిధ పుస్తకాలు చదువుకోవడం మంచిది. సెల్‌ఫోన్‌కు అలవాటు పడుతున్న విద్యార్థులను పుస్తక పఠనం వైపు తీసుకువెళ్లేందుకు సెలవులు ఎంతగానో ఉపయోగపడతాయి.

- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుందాం
- ఇంటిపట్టున ఉండి విజ్ఞానం పెంచుకుందాం
- మార్కెట్లో విరివిగా పుస్తకాలు
- పుస్తక పఠనంతో విజ్ఞానం



కథల పుస్తకాలు చదువుతున్న చిన్నారులు



కెరమెరి(ఆసిఫాబాద్): పిల్లలకు సెలవులు వస్తున్నాయంటే పెద్దల గుండెల్లో రైళ్లు పరుగెడుతుంటాయి. ఏడాది పాటు చదువు కోసం కార్పొరేట్ కాలేజీలకు వెళ్లిన పిల్లలు ఎప్పుడూ బిజీయే... వీరందరికీ వేసవి సెలవులు ఆటవిడుపు.. ఇంటికి వచ్చిన పిల్లలతో కుటుంబం సంతోషంగా గడపడం ఒక ఎత్తయితే స్నేహితులతో కలిసి ఎండలో తిరిగే పిల్లలతో పెద్దలకు టెన్షన్. ఇంటర్, పదో తరగతి ఫలితాలు రావడంతో విద్యార్థుల్లో ఉన్న టెన్షన్ కూడా పోయింది. ఇక ఉన్న సమయమంతా వృథా కాకుండా ఉండేందుకు పుస్తక పఠనం ఎంతో మేలు చేయనుంది.

సమాజాన్ని మేల్కొలిపేవి పుస్తకాలే..

ప్రస్తుత వేసవి సెలవుల నేపథ్యంలో విజ్ఞానాన్ని అందించే సాధనం పుస్తకం. గుడి, బడి ఉద్యానవనం, నిధి, కొడుకు, చెరువు వంటి సప్త సంతానాల్లో కావ్యం ఒక్కటే శాశ్వతంగా నిలబడుతుంది. ప్రజాస్వామ్యానికి ఉన్న స్తంభాలను నిలబెట్టేది పుస్తకమే. సంస్కార వంతులు పుస్తకం వ్యామోహంగా భావిస్తారు. సమాజాన్ని నిద్రలేపి మేల్కొలిపే పుస్తకాలు ఉన్నాయి.

విద్యార్థులు గొప్ప వ్యక్తుల జీవిత చరిత్ర చదవాలి

విద్యార్థులు గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు చదవాలి. పాఠ్య పుస్తకాలతో కుస్తీ పట్టి ఉన్నతికి ఉపయోగపడే విద్యను అందిస్తే మానసిక ఉల్లాసానికి కథల పుస్తకాలు, గొప్పవారి జీవిత చరిత్రలు ఉపయోగపడతాయి. బాల భారతం, రామాయణం వంటి పుస్తకాలతో పాటు ఆంగ్ల వ్యాకరణంపై పట్టు సాధించడం, వివిధ భాషల్లో అనర్గళంగా మాట్లాడడం, అక్షర దోష నివారణ, వ్యాసాలు రాయడం వంటి వాటిపై పట్టు సాధించాలి.

బొమ్మల కథలతో ఆసక్తి..

చిన్నప్పటి నుంచి స్కూల్ పుస్తకాలు చదవమంటేనే బోరుమంటూ తలలు పట్టుకునే పిల్లలు సైతం బొమ్మలతో ముద్రితమయ్యే చందమామ, బాలమిత్ర కథల పుస్తకాలు కనబడితే చాలు టక్కున పేజీలు తిప్పేస్తుంటారు. అందులో మొదలు ఆకట్టుకునే రంగురంగుల బొమ్మలు, అవే పిల్లలను పఠనం వైపునకు నడిపిస్తాయి. అలా ఆరంభమైన కథలు చదివే అలవాటుగా క్రమంగా ఆలోచన సరళిని పెంచుతాయి.

సెల్‌ఫోన్ నుంచి మళ్లించాలి

ప్రస్తుత తరుణంలో చిన్నవారి దగ్గర్నుంచి పెద్దల వరకు మొబైల్ వాడకం అధికంగా పెరిగింది. దీంతో విద్యార్థుల్లో పఠనాశక్తి పూర్తిగా తగ్గుతూ వస్తుందని ఇటీవల ఓ సర్వే వెల్లడించింది. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఆ తర్వాత ఇళ్లకు చేరగానే సెల్‌ఫోన్ మోజులో పడుతున్నారు. ఫలితంగా విద్యార్థులకు పుస్తకం చదవడం రావడం లేదు. సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలచేత ఆకట్టుకునే పుస్తకాలను చదివించడం అలవాటు చేస్తే బడికి వెళ్లిన తర్వాత కూడా అదే అలవాటుగా ఉంటుందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

ఇదిగిదిగో పుస్తకాలు..

మార్కెట్లో ఏ పుస్తక దుకాణానికి వెళ్లినా లేదా రైల్వే స్టేషన్‌కు వెళ్లినా.. అంగట్లోని బుక్ స్టాల్లో కాస్త దృష్టి సారించినా పలు బొమ్మల కథలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించే అనేక పుస్తకాలు కనిపిస్తాయి. ఇప్పటికీ ఆయా స్టాళ్లలో పెద్ద బాలశిక్ష, యకాన్‌విన్ యాత్రస్మృతి, వేయి పడగలు, మైదానం, చదువు, పాకుడు రాళ్లు, విశ్వంభర పుస్తకాలు చెక్కు చెదరని డిమాండ్‌తో అమ్ముడు పోతున్నాయి. అంతే కాకుండా ప్రముఖ నవలా రచయిత్రి యుద్దనపూడి సులోచన రాణి, మీనా–1తో పాటు మీరూ విజయాన్ని సాధించగలరు, నా జీవన గమనం, అక్బర్ బీర్బల్, ఇండియా విన్ డ్రీమ్స్, సాల్మాన్‌రష్డి, గోదాన్, పంచతంత్ర పుస్తకాలు ఇప్పటికీ పాఠకులను ఆకట్టుకుంటున్నాయి.